క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



కంబగిరి స్వామి ఆలయంలో భక్తులకు హారతిస్తున్న అర్చకులు

ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.జంబుల దిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు, సుద్దమల్ల గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల్లో కొలువుదీరిన స్వామివార్లకు భక్తులు అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు లక్ష్మణస్వామి, భాస్కరశర్మ, అనంతయ్య, కమలేష్‌శర్మ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పకడ్బందీగా ప్రణాళికలు సిద్ధం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఉయ్యాలవాడ : గ్రామాల అభివృద్ధికి పకడ్బందీగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఈఓపీ ఆర్డీ వెంకటేశ్వరరావు కార్యదర్శులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములు చేయాలన్నారు. రాబోయే 23 ఏళ్లలో మండలంలోని అన్ని గ్రామాలు పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

సన్మానం



దానంను సన్మానిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి

ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ డివిజన్ వెలుగు ఏరియా కో – ఆర్డినేటర్‌గా పనిచేసిన దానం ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ మేరకు శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం ఉద్యోగులు సన్మానించారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డితోపాటు ఉద్యోగులు, సిబ్బంది ఆయనకు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు.

అనారోగ్యంతో అన్నం సుబ్బయ్య మృతి



అన్నం సుబ్బయ్య(ఫైల్)

నంద్యాల(అర్బన్): వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన అన్నం సుబ్బయ్య(82) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. వ్యవసాయ శాఖలో వివిధ హోదాల్లో పని చేస్తూ ఆళ్లగడ్డ, నంద్యాల నియోజకవర్గాల్లో రైతులతో మమేకమై తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సుబ్బయ్య తెచ్చుకున్నారు. వ్యవసాయంలో మెలకువలు, సలహాలు ఇస్తూ 35 ఏళ్ల పాటు రైతులకు సేవలు అందించారు. 2000లో పదవీ విరమణ అనంతరం రైతులతో స్నేహ బంధాన్ని కొనసాగిస్తూ వారికి సలహాలు, సూచనలు ఇస్తూ వచ్చారు. నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం మృతి చెందారు. ఆయన మృతి పట్ల రాజకీయ, సామాజిక సంస్థలు, కుల సంఘాలు నాయకులు సంతాపం ప్రకటించారు.

తలసేమియా వ్యాధి పిల్లలకు కిట్ల పంపిణీ



కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

నంద్యాల (న్యూటౌన్): తలసేమియా వ్యాధి చిన్నారులకు శనివారం చైతన్య కళాభారతి స్వచ్ఛంద సంస్థ నిత్యావసర సరుకుల కిట్లను అందజేసింది. కార్యక్రమంలో కౌన్సిలర్ విజయ భాస్కర్, సంస్థ బోర్డు మెంబర్లు అనిల్‌కుమార్, వాసగిరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

నంద్యాల(రూరల్): పట్టణంలోని శ్రీనివాస నగర్‌లో కార్మికులు పారిశుధ్య పనులు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కమిషనర్ అంకిరెడ్డి తదితరులు పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల మురికినీరు రోడ్లపై చేరిందన్నారు. కాల్వలను శుభ్ర పరిచి, మురుగు నీరు నిల్వ లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు.

- నంద్యాలకు చెందిన శ్రీనివాస్‌కు ఇద్దరు కుమార్తెల సంతానం. ఒకరు ఇంటర్ రెండో సంవత్సరం, మరొకరు పదో తరగతి. పెద్దమ్మాయి కళాశాల 8 గంటలకే ప్రారంభమవుతుంది. చిన్నమ్మాయి స్కూల్ 9 గంటలకు ఉంటుంది. ఇద్దరూ కలిసిపోలేరు. ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేసే శ్రీనివాస్ దగ్గరుండి పిల్లలను కళాశాల, పాఠశాలలో వదల్లేని పరిస్థితి, దీంతో బాగా ఆలోచించిన శ్రీనివాస్ పిల్లలిద్దరికీ చెరో స్కూటీ కొనిచ్చాడు. ఇప్పుడా ఇంట్లో మూడు ద్విచక్రవాహనాలు ఉన్నాయి.
- వైఎస్సార్ నగర్‌కు చెందిన సుదర్శనకు ఇప్పటికే బైక్ ఉంది. అయితే కుటుంబమంతా బయటకు వెళ్లాలంటే బస్టాండు వరకూ వెళ్లి బస్సు కోసం వేచి చూడాలి. పైగా తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఉన్నారు. దీంతో సుదర్శన్ అందరికీ సౌకర్యంగా ఉండేలా కొత్తగా కారు కొన్నాడు. ఇప్పుడా కుటుంబం ఎటైనా వెళ్లాలంటే కారులో హాయిగా వెళ్తుంది. ఇలా వివిధ కారణాలతో జిల్లాలో నూతనంగా కొనుగోలు చేస్తున్న వాహనాల సంఖ్య భారీగా పెరుగుతోంది.

- జిల్లాలో పెరుగుతున్న వాహనాల వినియోగం
- ఒక్కో కుటుంబంలో రెండు, మూడు వాహనాలు
- జిల్లా మొత్తంగా 3.46 లక్షల వాహనాలు
- నెలకు 90కి పైగా కొత్త వాహనాల రిజిస్ట్రేషన్లు

రయ్.. రయ్!



పట్టణంలో తిరుగుతున్న వాహనాలు

నంద్యాల(న్యూటౌన్): గతంలో పేదోడి వాహనం అనగానే సైకిల్ గుర్తుకొచ్చేది. ఇప్పుడు ఆ స్థానాన్ని బైక్ భర్తీ చేస్తోంది. ఈ రోజుల్లో వాహనం లేని ఇల్లు లేదు. అవసరం కోసం కొందరు.. ఆడంబరం కోసం మరికొందరు వాహనాలు కొనుగోలు చేస్తుండగా.. జిల్లాలో వాహనాల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. మరోవైపు ప్రజల అభిరుచికి అనుగుణంగా సరికొత్త వాహనాలు మార్కెట్‌లోకి వస్తున్నాయి.

80 శాతం బైక్‌లే..

నెలలో సగటున వెయ్యి వాహనాలు జిల్లాలో కొత్తగా రోడ్డు మీదకు వస్తుండగా... అందులో 80 శాతం వాహనాలు బైకులు ఉంటున్నాయి. ప్రతి ఒక్కరూ అవసరాలకు అనుగుణంగా బైక్ కొంటున్నారు. ఇక ఆర్థికంగా ఉన్నవారు కార్లు కొనుగోలు చేస్తున్నారు. ఒక ఇంట్లో ఐదుగురు వ్యక్తులు ఉంటే కనీసం రెండు వాహనాలు ఉంటున్నాయి. వాహనాల కొనుగోళ్లలో బైక్, కారు, ఆ తర్వాత వ్యవసాయం కోసం రైతులు వినియోగించే ట్రాక్టర్లు ఉంటున్నాయి. రోజూ సగటున జిల్లాలో 30 నుంచి 50 దాకా బైక్‌లు, 5 నుంచి 10 వరకు కార్లు, ట్రాక్టర్లు రిజిస్ట్రేషన్ కోసం రవాణా శాఖ కార్యాలయాలకు వస్తున్నాయి. ఇలా వాహనాల క్రయ విక్రయాలు పెరగడంతో రవాణా శాఖకు కూడా ఆదాయం పెరుగుతోంది.

అవసరాలకు అనుగుణంగా..

ప్రస్తుతం జిల్లాలో ఒక్కో కుటుంబంలో కనీసం రెండు, మూడు వాహనాలు ఉంటున్నాయి. కుటుంబ సభ్యులందరి కోసం కారు, వ్యవసాయ పనుల కోసం ట్రాక్టర్, సొంత పనులపై వెళ్లేందుకు బైక్, మహిళల కోసం ఎలక్ట్రిక్ బైక్, బాలికల కోసం స్కూటీలు కొంటున్నారు. దీంతో ఒక్కో ఇంటి ముందు రెండు నుంచి మూడు వాహనాలు కనిపిస్తున్నాయి.



నంద్యాలలో పార్కింగ్ చేసిన మోటారు సైకిళ్లు

జిల్లాలో 3.47 లక్షల వాహనాలు

జిల్లా వ్యాప్తంగా కార్లు, బైక్‌లు, వివిధ వాహనాలు కలిపి మొత్తంగా 3.47 లక్షల దాకా ఉన్నాయి. ఇవన్నీ మన రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వాహనాలు మాత్రమే. ఇవి కాకుండా పొరుగున ఉన్న కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ అయిన లక్ష వాహనాలు జిల్లాలో తిరుగుతున్నాయి. ఈ లెక్కన జిల్లాలో 5 లక్షల కుటుంబాలు ఉండగా దాదాపుగా 4 లక్షల వాహనాలున్నాయి.

జిల్లాలోని వాహనాల వివరాలు ఇలా..

వాహనం	సంఖ్య
మోటారు సైకిళ్లు	2,74,768
ఆటోలు	16,531
కార్లు	16,832
గూడ్స్ వెహికల్స్	12,839
ట్రాక్టర్లు	21,553
జీపులు, క్యాబ్‌లు, స్కూల్ బస్సులు	4607

నెలకు 90కి పైగా రిజిస్ట్రేషన్లు



జిల్లాలో వాహనాల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. ఇందులో ఎక్కువ శాతం ద్విచక్ర వాహనాలే ఉన్నాయి. ఉంటు రానున్న రోజుల్లో కొత్తగా రోడ్డెక్కే వాహనాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఐదారేళ్లుగా వ్యక్తిగత వాహనాల వినియోగమూ బాగా పెరిగింది. ఫలితంగా రోజూ వాహనాల రిజిస్ట్రేషన్లు భారీగా ఉంటున్నాయి. అన్ని రవాణా వాహనాలు కలిపి సగటున నెలకు 90కిపైగా రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి.

– శ్రీకాంత్, ఇన్‌చార్జి డీటీఓ, నంద్యాల

వరుణా.. వదలవా?

దొర్నిపాడు: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు పత్తి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. క్రాసింగ్ చేసిన పిందెలు, మొగ్గలు నేల రాలుతున్నాయి. దీంతో శనివారం రైతులు క్రాసింగ్ పనులను చేయించుకోకుండా వదిలేశారు. కూలి మొత్తం అయినా మిగులుతాయని రైతులు ఇలా చేయాల్సి వస్తుంది. ఇప్పటికే అధిక తేమతో మగ పూలు రాక ఇబ్బందులు పడుతున్న సీడ్ పత్తి రైతులకు వరుస వర్షాలతో అతాలకుతలం అవుతున్నారు. వరుణా ఇక వదలవా అంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు.

విద్యార్థులకు క్షేత్రస్థాయిలో బోధన

రుద్రవరం: దసరా సెలవులు అయినప్పటికీ తువ్వపల్లె తిప్పమీదున్న ఏపీ మోడల్ పాఠశాల అగ్రి కల్చర్ విద్యార్థులకు క్షేత్రస్థాయిలో బోధన చేస్తున్నారు. శనివారం అగ్రికల్చర్ ట్రైనర్ జ్యోతిప్రియ ఇంటర్నల్ షిప్ వర్క్ చేయించారు. సెలవులను సద్వినియోగ పరుస్తూ విద్యార్థులకు వ్యవసాయానికి వినియోగించే పురుగు మందులపై అవగాహన కల్పిస్తున్నామని జ్యోతిప్రియ చెప్పారు. ఆర్‌బీకేలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాల వద్దకు వెళ్లి వివరాలు, వినియోగం తదితర అంశాలను విద్యార్థులకు వివరిస్తున్నామన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

రుద్రవరం: మండల పరిధిలోని మాచినేనిపల్లె గ్రామానికి చెందిన వెంకటపుల్లయ్య నుంచి 18 అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వరప్రసాదు శనివారం తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేశామన్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రాజోలి ఆనకట్టను పరిశీలించిన డీఈఈ



చాగలమర్రి మండలంలోని రాజోలి ఆనకట్టను పరిశీలిస్తున్న కె.సి.కెనాల్ డీఈఈ పుల్లయ్య

చాగలమర్రి: మండలంలోని రాజోలి ఆనకట్టను శనివారం కేసీ కెనాల్ డీఈఈ పుల్లయ్య పరిశీలించారు. ఆయన వైఎస్సార్ జిల్లా, జమ్మలమడుగులో గలేరి నగరి ప్రాజెక్టులో విధులు నిర్వహిస్తూ ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో నంద్యాల జిల్లా, కేసీ కెనాల్ డీఈఈ బాధ్యతలు చేపట్టారు. మొదటిసారిగా మండలంలోని రాజోలి ప్రాజెక్టు పరిశీలనకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన కేసీ కెనాల్ ప్రధాన కాలువ వెంట సుమారు 20 కిమీలు పర్యటించారు. చాగలమర్రి, మల్లెవేములతోపాటు వైఎస్సార్ జిల్లాల పరిధిలోని ఇడమడక, జిల్లేల్ల స్లూయిస్‌లను పరిశీలించారు. అనంతరం ఏఈ జమాల్‌వల్లి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ దస్తగిరితో ఆయుకట్టుపై చర్చించారు. సాగునీటి విడుదల వివరాలు అడిగి తెలుసుకున్నారు. తదనంతరం ఆయన మాట్లాడుతూ రాజోలి ప్రాజెక్టు వద్ద కుందూలో 9100 క్యూసెక్కల నీటి ప్రవాహం ఉందని, కేసీ కెనాల్ ప్రధాన కాలువకు 245 క్యూసెక్కులు విడుదల చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఈ జమాల్‌వలి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ దస్తగిరి, లస్కర్లు అబ్దుల్, ఆదం తదితరులు పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు..ఆదాయ మార్గాలు

నంద్యాల(అర్బన్): ప్రభుత్వానికి అధిక ఆదాయాన్ని ఇచ్చేవి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలేనని రాష్ట్ర మైనార్టీ, న్యాయశాఖ మంత్రి ఫరూక్ తెలిపారు. రిజిస్ట్రేషన్ల కోసం కార్యాలయాలకు వచ్చే ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించేందుకే కార్యాలయ మరమ్మతులు చేపట్టారన్నారు. దాతల సహకారంతో దశాబ్దాల క్రితం తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో ఏర్పాటైన నంద్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మంత్రి ఫరూక్ పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సౌకర్యం కోసం దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా రిజిస్ట్రార్ జానకీదేవి, తహసీల్దార్ ప్రియదర్శిని, శిరివెళ్ల సబ్‌రిజిస్ట్రార్ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ముందుకు వచ్చిన రియల్టర్లు

పదిరోజుల క్రితం నంద్యాల సబ్‌రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన అబ్దుల్‌సత్తార్ పాత కార్యాలయ రూపురేఖలు మార్చాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రభుత్వ నిధులు వస్తాయన్న దానిపై ఆశ లేని సబ్ రిజిస్ట్రార్ రియల్టర్లు, స్టాంప్ వెండర్ల సహకారం కోరినట్లు సమాచారం. దీంతో అడిగిందే తడవుగా రియల్టర్లు, స్టాంప్ వెండర్లు కార్యాలయ రూపురేఖలు మార్చేందుకు అవసరమైన నిధుల సేకరణ చేశారు. రెండు రోజులు కార్యాలయానికి సెలవు ప్రకటించి కార్యాలయంలో పాలిస్ బండల ఫ్లోరింగ్, వైరింగ్, బయటి పైకప్పునకు రంగులు దిద్దడం వంటి వాటిని పూర్తి చేశారు. మంత్రి ఫరూక్ అండదండలు ఉండాలని పునఃప్రారంభోత్సవానికి ఆయనను ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు సమాచారం.

గురువులు భావితరాలకు మార్గదర్శకులు

నంద్యాల (న్యూటౌన్): ఉపాధ్యాయులు జాతి నిర్మాణానికి మూల స్తంభాలని, భావితరాలకు మార్గదర్శకులని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి అన్నెం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శనివారం నంద్యాల పట్టణంలోని భారత్ అకాడమీలో 'విద్య, ఉపాధి, వ్యక్తిత్వ వికాసం' అంశంపై అకాడమీ డైరెక్టర్ గోపీకృష్ణ ఆధ్వర్యంలో చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మానవ వనరులను సానపట్టి జాతికి ఉపయుక్తకరంగా తీర్చిదిద్దడంలో విద్య ముఖ్యపాత్ర వహిస్తుందన్నారు. ఉపాధి మార్గాలకే విద్య పరిమితం కారాదని దేశభక్తి, సేవాభావం, సామాజిక బాధ్యత పట్ల స్పృహ కలిగించడం విద్య ఉద్దేశం కావాలన్నారు. విద్యాభ్యసనం తర్వాత సమాజంలో నిర్వహించబోయే పాత్రకు విద్యార్థులను ఉపాధ్యాయులు సంసిద్ధం చేయాలన్నారు. పట్టుదల, ప్రణాళిక సమయపాలనతో జీవితంలో ఉన్నతంగా స్థిరపడవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నీలం వెంకటేశ్వర్లు, కొప్పుల ప్రసాద్, నీలకంఠమాచారి తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో దసరా ఉత్సవ శోభితం







శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఉభయ ఆలయాల ప్రధాన ధ్వజస్తంభాలు, ఉపాలయాలను, ముఖద్వారాలను వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ఉభయ ఆలయంలో ఉన్న గోపురాలకు, స్వామిఅమ్మవార్ల ప్రధాన ఆలయాలకు దేదీప్యమానంగా విద్యుద్దీకరణ ఏర్పాటు చేశారు. దీంతో శ్రీశైల ఆలయంలో దసరా ఉత్సవ శోభ నెలకొంది.

సున్నిపెంటలో వైద్య శిబిరాల ఏర్పాటు



మహిళను పరీక్షిస్తున్న వైద్యురాలు

సాక్షి ఎఫెక్ట్

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట గ్రామంలో వైద్యాధికారులు రెండు వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. కొన్ని రోజులుగా గ్రామంలో చాలామంది అనారోగ్యంతో బాధ పడుతుండటంతో ×సున్నిపెంటకు జ్వరమొచ్చింది÷ శీర్షికన సాక్షి ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. శనివారం నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో చేపలమార్కెట్, వైజాగ్ కాలనీలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఆశా వర్కర్లు ఇంటింటికి వెళ్లి జ్వరంతో బాధపడుతున్న వారిని తీసుకొచ్చి వైద్య పరీక్షలు చేయించారు. అవసరమైన వారికి డాక్టరు మందులు ఉచితంగా పంపిణీ చేశారు. వైద్య శిబిరాల్లో డాక్టర్.ఎ.స్ఫూర్తితేజ, డాక్టర్.ఎ. బొజ్జిరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ కె.సుమతి, ఎంపీహెచ్‌ఈఓ ఎస్. నజీర్ అహ్మద్, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు

వ్యక్తిపై కేసు నమోదు

దొర్నిపాడు: మారుపేరుతో అవమానించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రం దొర్నిపాడుకు చెందిన జోషి అనే వ్యక్తిని రవి అనే మరోవ్యక్తి ఎలాంటి సంబంధం లేకుండా అవమానించాడన్నారు. పది మందిలో కూర్చొని ఉండగా తనను మారుపేరుతో పిలిచి అవమానించాడని జోషి పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు రవిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పాడు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం



పీఎస్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): మండలంలోని చాబోలు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ బదిలీపై పోలూరు గ్రామ పంచాయతీకి వెళ్తున్న నరేంద్రను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. చాబోలు సచివాలయ ఆవరణంలో శనివారం జరిగిన కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సచివాలయ ఉద్యోగులు హాజరై నరేంద్రను శాలువా, పూల మాలలతో సత్కరించి, గ్రామాభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొనియాడారు.

పెద్దపులి సంచారం

- భయాందోళనలో ప్రజలు

ఆత్మకూరు: మండలంలోని నల్లమల అటవీ పరిధిలో ఉన్న కొట్టాల చెరువు, వరదరాజుస్వామి ప్రాజెక్టు ప్రధాన రహదారిలో పెద్ద పులి సంచరించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇటీవల ఈ ప్రాంతంలో పలుమార్లు పెద్దపులి సంచరిస్తున్నట్లు గ్రామస్తులు అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఈ ప్రాంతానికి గొర్రెలు, మేకలు, ఆవులు, పశువులు మేత కోసం వెళ్తున్నాయి. ఎక్కడ పులి దాడి చేస్తుందోనని కాపరులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని ఫారెస్టు అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. ఇప్పటికైనా ఫారెస్టు అధికారులు స్పందించి పులిని బంధించి నాగార్జునసాగర్ అరణ్యంలోకి తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

అనుమతుల్లేని బోట్లను తిప్పేవారిపై చర్యలు తీసుకోవాలి

కొత్తపల్లి: కృష్ణానదిలో అనుమతుల్లేకుండా బోట్లను తిప్పేవారిపై చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్‌రెడ్డి కోరారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద అనుమతులున్న బోటు నిర్వాహకులతో కలిసి ధర్నా నిర్వహించి తహసీల్దార్ ఉమారాణికి వినతి పత్రం అందించారు. 25 కుటుంబాలు కృష్ణానది సిద్ధేశ్వరం ఘాట్‌పై ఆధారపడి జీవిస్తున్నాయని, వీరికి అన్ని అనుమతులు ఉన్నాయని తహసీల్దార్‌కు వివరించారు. కానీ కొంతమంది అనుమతులు లేకుండా ఫిట్‌నెస్ లైఫ్ జాకెట్స్ లేకున్నా బోట్లు తిప్పుతూ వీరి కడుపు కొడుతున్నారని ఫిర్యాదు చేశారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు.

క్రీడా దుస్తుల పంపిణీ



క్రీడాకారులతో షేక్షావలిరెడ్డి

నంద్యాల (న్యూటౌన్): ఏపీ జట్టు తరఫున జాతీయస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలలో ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ జట్టు సభ్యులకు గురు రాఘవేంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ షేక్షావలి రెడ్డి శనివారం క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలు జిల్లాలో జరగడం శుభపరిణామం అన్నారు. జాతీయస్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు అత్యంత ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలవాలని, నవ్యాంధ్ర ప్రదేశ్‌కు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా సాఫ్ట్‌బాల్ సెక్రెటరీ విజయకుమార్, పీడీ శ్రీధర్, పీఈటీ సుబ్బారావు పాల్గొన్నారు.

వైభవోపేతం.. స్వాతి మహోత్సవం



ఉభయ దేవేరులతో కొలువైన శ్రీ ప్రహ్లాదవరదుడు

ఆళ్లగడ్డ: అహోబిల నవనారసింహ క్షేత్రాలు భక్తజనసంద్రంగా మారాయి. స్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని శనివారం తండోపతండాలుగా తరలివచ్చిన భక్తులు భక్తి పారవశ్యంతో చేసిన గోవిందా నామస్మరణతో నల్లమల పులకించి పోయింది. దిగువ అహోబిలంలో ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాములను ఆండాల్ అమ్మవారి దేవాలయం ఎదురుగా యాగశాలలో కొలువుంచి అభిషేకం, అర్చన, తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను నూతన పట్టుపీతాంబరాలతో అలంకరణచేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం అర్చకుల వేద మంత్రోచ్ఛాణలు.. ఆస్థాన విద్వాంసుల మంగళ వాయిద్యాల మధ్య స్వాతి, సుదర్శన హోమాలు వైభవోపేతంగా నిర్వహించి పూర్ణాహుతితో ముగించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాత్రి విశేష పుష్పాలంకరణ గావించిన ఉత్సవ పల్లకీలో ఉభయ దేవేరులతో కొలువైన శ్రీ ప్రహ్లాదవరదుడు మాఢ వీధుల్లో సంచరిస్తూ భక్తులకు కనువిందు చేశారు.

అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు



చాగలమర్రి : శారదాదేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు

ఆళ్లగడ్డ : దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా శనివారం వాసవీమాత గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీమత్కన్యకా పరమేశ్వరీ దేవీ గాయత్రీ దేవి అలంకరణలో భక్తులను కనువిందు చేశారు. తెల్లవారు జామునుంచే అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.

రుద్రవరం: మండలంలో దసరా ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య జరుగుతున్నాయి. రుద్రవరంలో సంతానలక్ష్మిగా ఎల్లావత్తులలో అన్నపూర్ణాదేవిగా అమ్మవార్లు భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆయా గ్రామాల్లో ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవార్లను భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

శిరివెళ్ల: మండలంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య జరుగుతున్నాయి. స్థానిక అమ్మవారిశాలలో వైష్ణవీదేవీ అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయ దాతలు గెలివీ రాజేంద్రప్రసాదు, మంచికంటి శ్రీనివాసులు, కొండయ్య దంపతులతో పూజారి కేశవశర్మ అమ్మవారికి విశేష పూజలు జరిపించారు.

చాగలమర్రి: మండల కేంద్రం చాగలమర్రిలో వెలసిన శ్రీమత్కన్యకాపరమేశ్వరీ దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం శ్రీశారదాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి అమ్మవారికి పల్లకీ సేవ నిర్వహించారు. ముత్యాలపాడు గ్రామంలో వెలసిన శ్రీమత్కన్యకాపరమేశ్వరీదేవి శ్రీశారదాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వంకదార లక్ష్మణబాబు, ఆర్య వైశ్య సభ పాలకవర్గ ఉపాధ్యక్షుడు మల్లికార్జున, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఉప కార్యదర్శి జ్వాలా నర్సింహ్మయ్య, కోశాధికారి కూరపాటి రామకృష్ణ వరప్రసాద్, ఉప కోశాధికారి సుంకు జగదీష్, ధర్మకర్త క్రిష్టం శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ : దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా శనివారం ఇంజేడు గ్రామంలో చౌడేశ్వరీ దేవి అన్నపూర్ణాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉయ్యాలవాడలో వెలసిన మారెమ్మ అన్నపూర్ణాదేవి అలంకారంలో దర్శనమివ్వగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



ఆళ్లగడ్డ : అన్నపూర్ణదేవీ అలంకరణలో అమ్మవారు



రుద్రవరం: సంతానలక్ష్మిగా దర్శనమిచ్చిన అమ్మవారు



అన్నపూర్ణాదేవిగా.



శిరివెళ్లలో వైష్ణవీదేవీ అలంకారంలో అమ్మవారు